Office : 9440815774

మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

వ్యవస్థాపకులు : డి.విజయ్‌కుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : తిరుపతి - చిత్తూరు | సంపుటి : 02 | సంచిక : 263 | ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | గురువారం 8 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 2



## ఎంపీలను కొడతారా

# ఇక్కడి నుంచి కదిలేదే లేదు

- నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన
- జంతర్ మంతర్‌వైపు వెళ్తున్న ఇండియా కూటమి ఎంపీలను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- నేలపై పడుకొని నిరసన తెలిపిన ప్రియాంక గాంధీ
- పోలీసులు తనను గాయపరిచి కింద పడేశారని ఆగ్రహం!

## జగనన్న కాలనీల్లో

# ఇళ్లు కట్టుకుంటారా.. లేదా?



- జగనన్న కాలనీల్లో ఖాళీ ప్లాట్లు ఉంటే ఇతరులకు కేటాయించాలని సీఎం ఆదేశించారు
- కర్మయోగి కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి మంత్రులు శిక్షణ ఇవ్వాలని
- కేబినెట్ భేటీ అనంతరం చంద్రబాబు, మంత్రులతో పలు అంశాలపై చర్చలు
- ప్రజల మాట వింటేనే ఎక్కువకాలం జనంలో ఉంటారు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

సచివాలయంలో మంత్రివర్గ భేటీ అనంతరం తాజా పరిమాణాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. జగనన్న కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లకు ఇక కొత్త కేటాయింపులు, లబ్ధిదారులకు మరింత వెసులుబాటు కల్పించేలా కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇల్లు కట్టుకునేందుకు ఆసక్తి ఉన్నవారికి ప్లాట్లు ఇవ్వాలని చెప్పారు. ప్లాట్లు దక్కిన వారు తమకు అక్కర్లేదంటే మరో ప్రాంతంలో - మిగతా3లో



# త్వరలో డీపీఆర్

- గోదావరి డెల్టాలో రూ.13.4 కోట్లతో లైడార్ సర్వే పూర్తి
- గోదావరి డెల్టా ఆధునీకరణ, శాశ్వత ముంపు సమస్య పరిష్కారంపై మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో సమీక్షించారు.
- రూ.13.4 కోట్లతో నిర్వహించిన లైడార్ సర్వే ఆధారంగా డీపీఆర్ సిద్ధం
- రూపొందుతున్న సమగ్ర ప్రాజెక్టు నివేదిక
- అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు చర్యలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గోదావరి డెల్టా ప్రాంతంలో ఏటా వస్తున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునీకరణ పనులకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు, సాంకేతిక నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.13 కోట్ల 40 లక్షల భారీ వ్యయంతో - మిగతా3లో

## కోట్లాది మంది భారతీయుల విశ్వాసమే నా అతిపెద్ద బలం

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు
- 'సేవే లక్ష్యంగా స్వయంసేవకులు'
- తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదు
- దేశ సాంస్కృతిక ఆత్మను కాపాడుతూ, భారత్‌కు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న అనేక మంది స్వయంసేవకులు, కార్యకర్తలు తనకు అండగా ఉన్నారు.
- ఒకప్పుడు మనకు ఉగ్రవాదం పెనుముప్పుగా ఉండేది
- ఇప్పుడు భారత్ అభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోంది



## ఎన్నికల కమిషనర్ల నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్



- స్వీకరించిన సుప్రీంకోర్టు
- ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై సుప్రీంకోర్టులో మరో కీలక మలుపు
- నాటి తీర్పును వెనక్కి తీసుకోవాలంటూ పిటిషన్ దాఖలైంది
- పిటిషన్‌ను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి వెల్లడి



## యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా..

- బ్రాహ్మణ ఓట్లపై కాంగ్రెస్ గురి
- యూపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బ్రాహ్మణ నేత ఆరాధన మిశ్రా నియామకం
- బ్రాహ్మణ ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ పాత వ్యూహం
- 2017లోనూ ప్రశాంత్ కిశోర్ సలహాతో ఇదే ప్రయోగం విఫలం

# డ్రగ్స్‌పై యుద్ధం..

- సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని - మిగతా3లో

## ఓటర్ల జాబితాపై

# ప్రత్యేక డ్రైవ్



- 'అనర్హులను తొలగించడమే లక్ష్యం'
- సర్ ప్రక్రియలో ఓటర్ల జాబితా నుంచి అనర్హులుగా గుర్తించినవారిని గురువారం నుంచి బీఎల్‌ఓలు బూత్ స్థాయిలో పరిశీలన చేయనున్నారు.
- ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.
- నేటి నుంచి సర్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీఈవో నిర్ణయం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఏపీలో సర్' ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి అనర్హులుగా గుర్తించినవారిని నేడు (గురువారం) నుంచి బీఎల్‌ఓలు బూత్ స్థాయిలో పరిశీలన చేయనున్నారు. ఈ మేరకు నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ వెల్లడించారు. ప్రతి అర్హతగల ఓటర్‌ను చేర్చి, ఓటర్ల జాబితాలో అనర్హుల నమోదులు ఏవీ మిగిలిపోకుండా చూడాలన్న భారత ఎన్నికల సంఘం లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రత్యేక విస్తృత సవరణ, 2026 కింద జరిగిన గణన దశలో, బీఎల్‌ఓలు 15 జూన్ నుంచి 24 - మిగతా3లో



## ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్తుల భవనం

- గర్భిణి, చిన్నారితో సహా ముగ్గురు మృతి
- సీమాపురిలో భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు మృతి
- మరో ఎనిమిది మందికి గాయాలు

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APETL/2024/86143



# విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

### చైర్మన్ జె.వి.సత్యనారాయణమూర్తి




**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 07:**
హిందూపురంలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 61వ శాఖను ప్రారంభించనున్న సందర్భంగా బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బ్యాంకు చైర్మన్ జె.వి. సత్య నారాయణమూర్తి మాట్లాడారు. సహకార వ్యవస్థ బలోపేతంతో ఆర్థిక అంతరాలను తగ్గించ వచ్చన్నారు. 1916లో ప్రారంభమైన తమ బ్యాంకు ప్రస్తుతం 60 శాఖలతో రూ.8,726 కోట్ల వ్యాపారం నిర్వహిస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో హిందూపురంతో పాటు మరో ఎనిమిది కొత్త శాఖలను ప్రారంభించి రూ.9,500 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని సాధిం చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హిందూపురం శాఖ ద్వారా ఐదేళ్లలో రూ.100 కోట్ల లావాదేవీల లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బంగారం,గృహ, వ్యాపార, వాహన, విద్యా రుణాలతో పాటు సభ్యులకు వివిధ సంక్షేమ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులకు ఇంటి వద్దకే సేవలు, బంగారు రుణాలకు జీరో ప్రాసెసింగ్ ఫీజు వంటి సౌకర్యాలు ఉన్నా యని వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, డైరెక్టర్లు, అధికా రులు, హిందూపురం శాఖ మేనేజర్ సాయిరాం కోటి, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతన్నకు భూ హక్కు భరోసా



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**
హిందూపురం మండలం బేవినహల్లి గ్రామంలో బుధవారం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ బేవిన హల్లి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు శాశ్వత హక్కు కల్పించడమే ప్రభు త్వ లక్ష్యమన్నారు. పట్టాదారు పాసుపుస్తకం రైతుకు ముఖ్యమైన ఆస్తి పత్రమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాసుపుస్తకాలు అందజేసినందుకు రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ అశ్వినీనాగరాజు, చంద్ర, మూర్తి, గోపాల్‌రెడ్డి, గోపాలప్ప, వీఆర్వో మోహన్‌బాబు, సచివాలయసిబ్బంది, టీడీపీనాయకులు,రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ఎంపీపీ రేసులో కన్నలి ప్రతాప్ రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ తొట్టం బేడు మండలంలో ఎంపీపీ పదవిపై రాజకీయ ఉత్కంఠ నెలకొంది. టీడీపీ సీనియర్ నాయ కుడు కన్నలి ప్రతాప్ రెడ్డి పేరు ఎంపీపీ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. పార్టీ కష్టకాలం లో కార్యకర్తలకు అండగా నిలిచి, మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేసిన ఆయనకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆశీస్సులు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోం ది. పెద్దకన్నలికి చెందిన ప్రతాప్ రెడ్డి రాజకీయాలతో పాటు పారిశ్రామిక రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. అట్టల తయారీ పరిశ్రమ ద్వారా సుమారు 270 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నట్లు సమాచారం. అలాగే అగస్తీశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణకు కృషి చేయడంతో పాటు రైతులు, పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటున్నారని అనుచరులు పేర్కొం టున్నారు. ఈ నేపథ్యంలో ప్రతాప్ రెడ్డికి ఎంపీపీ అవకాశం కల్పిస్తే మండల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తారని టీడీపీ శ్రేణులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దీంతో తొట్టంబేడు ఎంపీపీ పదవి ఎవరిని వరిస్తుందన్న అంశం ఆసక్తికరంగా మారింది.

# పేదలకు ఉచిత వైద్య శిబిరం

### 38వ వార్డు సచివాలయంలో వైద్య సేవలు

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**



ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం 38వ వార్డు సచివాల యంలో బుధవారం పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు, ఆయాలు, ఆశా కార్యకర్తలు సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. వివిధ అనారోగ్య సమస్యలకు సంబం ధించి ఎక్స్‌రే, స్కానింగ్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిం చినట్లు మాజీ కౌన్సిలర్ నాగేంద్రమ్మ తెలిపారు. కార్యక్రమంలో బూత్ ఏజెంట్ గణేష్, టీడీపీ నాయకులు బ్రిటిష్ మూర్తి, సుద్దకుంట అంజి, రాజేష్, నాగరాజు, ఆంజనేయులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## శివరామపురంలో ఎంపీడీఓ పర్యటన

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**



కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం పరిధిలోని శివరామపురం గ్రామపంచా యతీ పరిధిలో తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, సిమెంటు రోడ్ల సమస్యలపై గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ బుధవారం పలు గ్రామాల్లో పర్యటించారు. గట్టూరులో సైడ్ డ్రైనేజీ, వీధి దీపాలు, నంజంపేటలో పైపుల విస్తరణ పనుల అవసరాన్ని గుర్తించినట్లు తెలిపారు. పనులకు అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపి, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి గిరిబాబు, ఆనందరెడ్డి, సదానందం, శేఖర్, భాస్కర్‌శెట్టి, నారాయణ స్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రేణిగుంట రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసరాల్లో అధ్వాన పారిశుద్ధ్యం









**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
రేణిగుంటలో వర్షం కురిసిందంటే చాలు.. రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పాదచారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపో వడంతో పాటు మట్టి, చెత్త కలసి బురదగా మారుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్,ఆర్టీసీ బస్టాండ్‌కు నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం కురిసిన సమయంలో ఆయా ప్రాంతా ల్లో నీరు నిలిచిపోవడంతో రోడ్లపై నడిచేందుకు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో బురద నీరు చిమ్మడంతో ప్రయాణికులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మట్టి, చెత్త పేరుకుపో వడంతో వర్షపు నీరు సులభంగా వెళ్లే పరిస్థితి లేకుండా పోతోందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. వర్షం తగ్గిన తర్వా త కూడా నీరు పూర్తిగా తొలగడానికి సమయం పడుతు ఒడటంతో రోడ్లపై బురద పేరుకుపోతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్, బస్టాండ్ వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల రాకపోకల కు ఇబ్బందులు లేకుండా వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతు న్నారు. డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం తో పాటు, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కా రం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలంలో ముందస్తు పారిశుద్ధ్య చర్యలు చేపట్టి రోడ్లపై చెత్త, మట్టి పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటే ప్రయాణికులకు, స్థానికులకు ఇబ్బందులు తగ్గుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసరాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# కార్యకర్త సంక్షేమమే టీడీపీ తొలి ప్రాధాన్యత

### డా.యం.ఉమేష్ రావు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని, కార్యకర్త సంక్షేమమే పార్టీ తొలి ప్రాధాన్యత అని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని 18వ వార్డు టీడీపీ కార్యాలయంలో 50, 51, 52, 53 బూత్‌ల పరిధిలోని కార్యకర్తల సమావేశం పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమేష్ రావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి అవసరమైన నిధులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కార్యకర్తల సంక్షేమంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జనసేనలో చేరనున్న శెట్టిపల్లి సురేష్ త్వరలో

## పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరుతానని వెల్లడి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి అమరావతి-తాడేపల్లిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన అనంతరం నియోజకవర్గంలోని ప్రముఖులను కలిసి ఆత్మీయంగా ఆహ్వానించే కార్యక్రమంలో భాగంగా జనసేన నాయకులు మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్ శ్రీకాళహస్తి పట్టణ ప్రముఖుడు, పారిశ్రా మికవేత్త, మాజీ శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ చైర్మన్ శెట్టిపల్లి సురేష్‌ను ఆయన స్వగృహంలో కలి శారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి సురేష్‌ను శాలువాతో సత్కరించి జనసేన పార్టీలోకి ఆహ్వా నించారు. దీనికి స్పందించిన శెట్టిపల్లి సురేష్ త్వరలోనే జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. అనంతరం జనసేన నాయకులు మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్‌లను కూడా శెట్టిపల్లి సురేష్ సన్మానించారు. ఈ ఆత్మీయ భేటీలో మాజీ కౌన్సిలర్ జయదేవన్ గిరి, పోలస్వామి వేణు, ముని శేఖర్, పోలి గణేష్, లీలా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల ఆరోగ్యం, పోషణపై

# టీడీపీ నేతల ప్రత్యేక శ్రద్ధ



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**
కుప్పం మున్సిపాలిటీ 11వ క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వారోత్సవాల్లో స్థానిక టీడీపీ నాయకులు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆటలు, ఆరోగ్య పరిరక్షణ కార్యక్ర మాలను పరిశీలించారు. చిన్నారులతో మమేకమై వారితో కొంతసేపు గడిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలపై అంగన్‌వాడీ కార్యకర్తల ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణతో పాటు శారీరక, మానసిక వికాసా నికి అంగన్‌వాడీ కేంద్రాలు చేస్తున్న కృషి అభినందనీయమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. తల్లిదండ్రులకు కూడా పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 11వ క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కౌన్సిలర్ కస్తూరి వేలు, యూనిట్ ఇన్‌చార్జ్ సుభాన్ బాబు, సుబ్రమణి, కో-యూనిట్ ఇన్‌చార్జ్ రవి, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మున్సిపల్ జనరల్ సెక్రటరీ నబి ఉల్లా, టీ.కే. సోమశేఖర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నాగభూషణం, కొత్తపేట వాసు, పార్టీ అధ్యక్షులు ఇర్ఫాన్, సాయికుమార్, బూత్ ఇన్‌చార్జ్‌లు ఉమాశంకర్, గనియుల్లా, స్వామి, స్కూల్ చైర్మన్ చంద్ర, దిలీప్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్.ఆర్.శంకరన్ సేవలు చిరస్మరణీయం

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**



మాజీ ఐఏఎస్ అధికారి, ప్రజా సేవకుడు ఎస్.ఆర్. శంకరన్ 16వ వర్ధంతి సందర్భంగా బుధవారం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటా నికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎల్. పురు షోత్తం మాట్లాడుతూ పేదలు, దళి తులు, గిరిజనులు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం శంకరన్ చేసిన సేవలు చిరస్మరణీయ మన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారిసమస్యలను సానుభూతితో పరిష్క రించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం స్వచ్ఛ అవార్డు సాధించిన పాతగుంట పంచాయతీ కార్యదర్శి దివ్యవాణిని సన్మానించారు. అలాగే వర్మీ ఉత్పత్తి లో రాష్ట్రంలోని టాప్-500 పంచాయతీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొమరగుంట, నల్లవెం గనపల్లి, అగ్గిచే నుపల్లి పంచాయతీ కార్యదర్శులు వరలక్ష్మి,లక్ష్మీనరసింహ, నాగభూషణంలను అభినందించారు. కార్యక్రమంలో ఉప ఎంపీడీఓ వై. మాధవి, పరిపాలన అధికారి జగదీశ్వర్, సిబ్బంది, పంచా యతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలి

### మూడు రోజుల పాటు కోర్టు విధుల బహిష్కరణ : రిలే నిరాహారదీక్ష



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 07:**
న్యాయవాదుల భద్రత కోసం అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని డిమాం డ్ చేస్తూ హిందూపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నుంచి మూడు రోజు ల పాటు కోర్టు విధులను బహిష్కరించి రిలే నిరాహారదీక్ష చేపట్టారు. బీపీఎల్ షోరూం ఎదుట చేపట్టిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. విధి నిర్వహణలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం అవసరమన్నారు. న్యాయవాదులపై దాడులకు కఠిన శిక్షలు విధించాలని, ప్రతి కోర్టు ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు కల్పించాలని, న్యాయవాదుల గౌరవం, స్వేచ్ఛ, భద్రతకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, న్యాయవాదులు తిమ్మారెడ్డి, రాజ శేఖర్, హిదయతుల్లా, రామిరెడ్డి, నాగేంద్ర, కర్ణపు శ్రీనివాసులు, శ్రీరాములు, సిద్ద గంగప్ప, పని భూషణ్, అతిక్, చంద్రశేఖర్‌రెడ్డి, జయదూర్ రెహ్మాన్, వెంకటేష్, మనోహర్‌రెడ్డి, రవిచంద్ర, వెంకటేష్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

### వీబీ-జీ రామ్‌జీ పథకం అమలులో

## పారదర్శకత పాటించాలి : ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్



**శాంతీపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**
వీబీ-జీ రామ్‌జీ పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటించాలని శాంతీపురం ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండల సచివాలయంలో బుధవారం పథకం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడి,పట్టు, గోకులం షెడ్ల బిల్లుల చెల్లింపులపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, అవి వాస్తవమని తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని సూచించారు. ప్రతిరోజూ రెండు గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పనుల ప్రదేశాల్లో మస్టర్ల నిర్వహణ పారదర్శకంగా చేపట్టడంతో పాటు నాణ్యమైన ఫొటోలు, వీడియోలు నమోదు చేయాలని తెలిపారు. బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం లేదా ఇతర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ రెడ్డమ్మ, టీఏలు శ్రీనివాసులు, ధర్మలింగం, మునిరాజు, శంకరప్ప, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# వైల్డ్ కార్డ్ ఎంట్రీలపైనే జగన్ ఆశలు

**విశాఖపట్టణం :** వైసీపీలో వారసత్వ రాజకీయాలు జోరుగా సాగుతూ ఉంటాయి. జగన్ కూడా వైయస్ వారసుడే కాబట్టి.. పైగా ఆయన పేరు చెప్పుకునే పార్టీకి పేరు పెట్టుకున్నారు. వైయస్ పేరు లేకుంటే జగన్ కు ఈరోజుకు కూడా గుర్తింపు లేదు. ఎందుకంటే రాజశేఖర్ రెడ్డి వేసిన రాజకీయ పునాదులు అటువంటివి. జగన్ పార్టీలో కూడా వారసత్వ రాజకీయాలు జోరుగా సాగుతూ ఉంటాయి. అందువల్లే ఆ పార్టీలో ఉన్న నాయకులు తమ వారసులను లేదా బంధువులను.. ఇతర అనుచరులను రాజకీయాల్లోకి తీసుకొస్తూ ఉంటారు.ప్రస్తుతం ఏపీలో పురపాలక ఎన్నికలు జరగబోతున్నాయి. వైసిపి ఇప్పుడు అధికారం లేదు. అలాగని పూర్తిగా హ్యాండ్సప్ అవ్వకుండా.. గట్టిగా పోరాటం చేయాలని నేతలు నిర్ణయించుకున్నారు. అందువల్లే కీలకమైన నగర పాలకాలలో పోటీకి సై అంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. నాడు విశాఖపట్నం.. గుంటూరు.. నెల్లూరు నగర పాలకాలను వైసిపి దక్కించుకుంది. అయితే ఈసారి కూడా ఆ మూడు స్థానాల మీద గట్టిగా దృష్టి సారించినట్టు సమాచారం.. అందువల్లే ఈ మూడు కార్పొరేషన్లలో కొత్త పేర్లు తెరమీదకి వచ్చినట్టు ప్రచారం జరుగుతుంది.విశాఖపట్నంలో బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష.. గుంటూరు నుంచి మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె మౌనిక.. నెల్లూరు నుంచి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత పేర్లు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం వైసిపికి కీలకమైన రాజకీయ కేంద్రం. ఇక్కడ బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని పార్టీ అధిష్టానం భావిస్తోంది. పొలిటికల్గా యాక్టివ్ గా ఉన్న అనూషకు ఇటీవల భీమిలి సెగ్మెంట్ బాధితులు అప్పగించింది పార్టీ. వాస్తవానికి ఆమెను జిల్లా పరిషత్ కు పోటీ చేయించే ఆలోచనలో బొత్స ఉన్నారని చర్చ కూడా నడిచింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాలు వేరే విధంగా మారిపోయాయి. దీంతో భీమిలి అనూష చేతికి సొంతమయ్యాయి. భీమిలిలో పార్టీని బలోపేతం చేస్తూనే.. విశాఖ మేయర్ పీఠం రేసులో అనూషను నిలబడితే ఎలా ఉంటుందనే ఆలోచన వైసీపీకి వచ్చినట్టు తెలుస్తోంది.ఇక



గుంటూరు కార్పొరేషన్ విషయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె మౌనిక పేరు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఈమె తండ్రికి సపోర్ట్ గా నిలుస్తున్నారు. ఆమధ్య రాంబాబు కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చర్చకు దారి తీసినప్పుడు మౌనిక పొలిటికల్ స్క్రీన్ మీదకి వచ్చారు. నాడు ఆమె తండ్రికి సపోర్ట్ గా నిలిచారు. ఇక అధికార పక్షానికి గట్టిగానే కౌంటర్లు ఇచ్చారు. నాడు రాంబాబుకు సరైన వారసురాలు దొరికిందని రాజకీయవర్గాలలో చర్చ మొదలైంది. రాంబాబు ఆ మధ్య జైలుకు వెళ్లిన తర్వాత బెయిల్ మీద బయటకు వచ్చారు. ఆ తర్వాత మౌనిక అంతగా కనిపించలేదు. అయినా సరే ఆమెనే గుంటూరుకు దించితే బాగుంటుంది అని చర్చ నడుస్తోంది.నెల్లూరు కార్పొరేషన్ విషయానికొస్తే మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత పేరు వినిపిస్తోంది. గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ అయిన సమయంలో పూజిత తండ్రికి సపోర్ట్ గా నిలిచారు. రాజకీయంగా స్పందించారు. ప్రస్తుతం ఆమె వైసీపీ మహిళా విభాగం సంబంధించి వర్కింగ్ ప్రెసిడెంట్గా కొనసాగుతున్నారు. అనూష, మౌనికతో పోల్చి చూస్తే పూజిత పార్టీ వ్యవహారాలలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాత్రలు పోషిస్తున్నారు. రాజకీయంగా యాక్టివ్గా కొనసాగుతున్నారు.. సో ఈ దగ్గర 3 ముఖ్యమైన కార్పొరేషన్లలో ముగ్గురు వారసురాళ్లను రంగంలోకి దింపితే.. క్యాడర్లో కూడా ఉత్సాహం పెరుగుతుందని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు.. తండ్రులకు సీనియారిటీ ఉండడం.. కుమార్తెలు కూడా దూకుడుగా ఉండడంతో రాజకీయంగా కలిసి వస్తుందని వైసీపీ అధిష్టానం భావిస్తుంది. అయితే ఇంతవరకు రిజర్వేషన్లు తేలలేదు కాబట్టి.. రాజకీయ సమీకరణాలు.. కేడర్ అభిప్రాయాలు.. ఇతర విషయాలను పరిశీలనలోకి తీసుకున్న తర్వాత వీరి ముగ్గురి పోటీ గురించి అసలు విషయాలు బయటకు తెలుస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# అసెంబ్లీ ఫార్ములా రగడ...

**ఒంగోలు :** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ఇప్పుడు మరో కీలక రాజకీయ పరీక్షను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో కూటమి నాయకత్వం వ్యూహరచనకు పదును పెడుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన సుదీర్ఘ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.అమరావతిలో దాదాపు రెండు గంటల పాటు జరిగిన భేటీలో స్థానిక ఎన్నికల్లో కూటమి ఎదుర్కొనే ప్రధాన సవాళ్లపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశం కేవలం సీట్ల పంపకాలపై చర్చకే పరిమితం కాలేదన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు టీడీపీ?జనసేన మధ్య సమన్వయం ఎలా ఉండాలి? ఏ పార్టీకి ఏ ప్రాంతంలో బలం ఉంది? మిత్రపక్షాల మధ్య పోటీ కారణంగా ఓట్లు చీలకుండా ఎలా చూడాలి? అనే అంశాలే అసలు ఎజెండాగా కనిపిస్తున్నాయి.సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రధాన కారణాల్లో టీడీపీ, జనసేన మధ్య సమన్వయం ఒకటి. ఇప్పుడు అదే ఫార్ములాను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేయాలని నాయకత్వం భావిస్తోంది. అయితే స్థానిక ఎన్నికల స్వభావం అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నం. ఇక్కడ అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక వర్గ సమీకరణాలు, కుటుంబ రాజకీయాలు, గ్రామస్థాయి సంబంధాలు, స్థానిక నాయకుల మధ్య పోటీ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అందుకే రాష్ట్రస్థాయిలో కుదిరే అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేయడం కూటమి నాయకత్వానికి అసలు సవాలుగా మారనుంది.ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన మధ్య ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం కీలకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలమైన కేడర్, సామాజిక ఆధారం, స్థానిక నాయకత్వం ఉందో అంచనా వేసి, అక్కడ ఆ పార్టీకి ప్రాధాన్యం ఇచ్చే విధానం తెరపైకి వస్తోంది.ఇది కేవలం సీట్ల సర్దుబాటు కాకుండా.. కూటమి ఓటు బ్యాంకును సమర్థంగా వినియోగించుకునే ప్రయత్నంగా చూడొచ్చు. ఒకే ప్రాంతంలో మిత్రపక్షాలు పరస్పరం పోటీ పడితే అధికార వ్యతిరేక ఓటుతో పాటు కూటమి ఓటు కూడా చీలిపోయే అవకాశం ఉంటుంది.




ఈ ప్రమాదాన్ని ముందుగానే అడ్డుకోవడమే సమన్వయ కమిటీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.పవన్ కళ్యాణ్‌తో సమావేశం అనంతరం చంద్రబాబు టీడీపీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ కావడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక ఎన్నికల విషయంలో పార్టీ అంతర్గతంగా ఎలాంటి అసంతృప్తి తలెత్తకుండా చూడాలని చంద్రబాబు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, ఆశావహులు అసంతృప్తికి గురైతే దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో పడే అవకాశం ఉంది. అందుకే వ్యక్తిగత ప్రయోజనాల కంటే కూటమి ప్రయోజనాలే ముఖ్యమని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి కేవలం మరో ఎన్నిక కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ?జనసేన భాగస్వామ్యం క్షేత్రస్థాయిలో ఎంతవరకు బలపడిందో తేల్చే పరీక్ష కూడా. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కనిపించిన ఐక్యతను గ్రామస్థాయి రాజకీయాల్లో కొనసాగించగలిగితే కూటమి మరింత బలపడే అవకాశం ఉంటుంది.అయితే స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత ఆశలు, స్థానిక ఆధిపత్య పోటీలు, టికెట్ల కోసం పోటీ పెరగడం సహజం. ఈ విభేదాలను ఎంత సమర్థంగా పరిష్కరిస్తారన్నదే కూటమి విజయానికి కీలకంగా మారనుంది.మొత్తంగా చంద్రబాబు?పవన్ భేటీని చూస్తే.. స్థానిక ఎన్నికల్లో ఎవరు ఎన్ని స్థానాలు గెలుస్తారనే దానికంటే ముందుగా కూటమి భాగస్వామ్య పక్షాలు ఒకరినొకరు ఎంతవరకు సమన్వయం చేసుకుంటాయన్నదే అసలు రాజకీయ కథగా మారుతోంది. గ్రామస్థాయిలో ఈ సమన్వయం సక్సెస్ అయితే స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమికి మరో పెద్ద రాజకీయ బలంగా మారే అవకాశం ఉంది.

# గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జిఎస్టి వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది.2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జిఎస్టి వసూళు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జిఎస్టి వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జిఎస్టి వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది.ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జిఎస్టి రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది.ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా.. వినియోగం.. వ్యాపార కార్యకలాపాలు.. పన్ను అనుసరణ వంటి అనేక అంశాలు కూడా జీఎస్టీ వసూళ్లకు దోహదం చేశాయని వాణిజ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో సెప్టెంబర్ 2026 లో మొత్తం స్థూల జిఎస్టి వసూళ్లు కూడా 14.7% పెరిగాయి. మొత్తంగా 2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొత్తంగా చూస్తే జిఎస్టి వసూళ్లలో ఏపీ నమోదు చేస్తున్న అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించే పరిణామం లాగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఏపీ రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధిస్తుంది. సమర్థవంతమైన నాయకత్వం.. ఆర్థిక అంశాలలో పొదుపు వల్ల ఈ స్థాయిలో వసూళ్లు సాధ్యమయ్యాయి. కాగా, ఏపీ ఖజానా ఇలా కావడం.. జగన్ కు మింగుడుపడని వార్త అని టీడీపీ నాయకులు అంటున్నారు.

## డ్రగ్స్‌పై యుద్ధం..

-మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకుంటారా.. లేదా?

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వాలని ఆదేశించారు. కర్మయోగి కార్యక్రమంలో భాగంగా మంత్రులు తమ శాఖల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. మోదీని 'రైట్ టైమ్- రైట్ ప్లేస్- రైట్ లీడర్'గా చంద్రబాబు అభివర్ణించారు. నరేంద్ర మోదీ కార్యక్రమాలపై నిరంతరం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రధానిగా ఉన్నప్పటికీ అందరి అభిప్రాయాలను మోదీ వింటారని సీఎం అన్నారు. మంత్రులు కూడా ప్రజలు చెప్పే విషయాలను శ్రద్ధగా విని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నాయకుడు ప్రజల మాట వింటేనే ఎక్కువకాలం జనంలో ఉండగలరని పేర్కొన్నారు. కేబినెట్ నిర్ణయాలను కలెక్టర్లకు వివరించి క్షేత్రస్థాయిలో సమీక్షించాలని చెప్పారు.

స్వయం ఉపాధి సంఘాల వద్ద ఉన్న రూ.30,000 కోట్ల కార్పస్ నిధులను ప్రస్తావిస్తూ మిగిలిన గ్రూపులను కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. కుప్పంలో ఇజ్రాయెల్ సాంకేతికతతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్న తన ఆలోచనను గుర్తు చేసిన చంద్రబాబు, అదే సాంకేతికతను మోదీ గుజరాత్‌లో విజయవంతంగా అమలు చేయించారని తెలిపారు. కేబినెట్‌కు నలుగురు మంత్రులు గైర్హాజరైన అంశంపై మీడియా కథనాలను సీఎం ప్రస్తావించారు. అమాత్యులు రాకపోవడానికి కారణాలు తనకు తెలుసని, ఇకపై అన్ని విషయాలను మీడియాకు స్పష్టంగా వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

మరోవైపు సీఎం చంద్రబాబుతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. రాజధానిలో కేటగిరి-4, ఎండోమెంట్ భూముల అంశంపై చర్చించారు. వీటిపై స్పందించిన ముఖ్యమంత్రి భూములకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మరోసారి తన దృష్టికి తీసుకురావాలని నారాయణకు తెలిపారు.

## ఓటర్ల జాబితాపై ప్రత్యేక డ్రైవ్

-మొదటిపేజీ తరువాయి

జూలై, 2026 వరకు ఇంటింటి పర్యటన చేశారు. మరణం, శాశ్వత నివాస మార్పు, బహుళ నమోదులు, ఆచూకీ తెలియకపోవడం, ఇతర కారణాల వల్ల మొత్తం 44.89 లక్షల మంది ఓటర్లు వారు ఇచ్చిన చిరునామాలలో కనబడలేదని నివేదించారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ గణన పూర్తి చేసి తర్వాత 3.71 కోట్ల మంది ఓటర్లతో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాలను జూలై 31న రాష్ట్రంలో ప్రచురించారు. ఏ ఒక్క అర్హతగల ఓటరును విస్మరించకూడదనే ఈసీఐ నిబద్ధతలో భాగంగా, నోటీసు దశలో ఏస్?డీడీ ఓటర్లు / అనర్హులైన ఓటర్ల పునఃపరిశీలన, కొత్త ఓటర్లు / విస్మరించిన ఓటర్ల నమోదు కోసం ఒక ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టాలని కమిషన్ నిర్ణయానికి అనుగుణంగా దీనిని నిర్వహిస్తున్నట్టు సీఈవో వివేక్‌యాదవ్ చెప్పారు.

**46.62 లక్షల ఓట్లు తొలగింపు**

ఈ డ్రైవ్‌లో భాగంగా, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) రేపటి నుంచి, తొలగించబడిన 46.62 లక్షల మంది పేర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి ఆ ఓటర్ల స్థితిని పునఃపరిశీలిస్తారని వివేక్‌యాదవ్ ప్రకటించారు. ఈ దశలో ఏదైనా ఓటర్ పొరపాటున తొలగింపు జరిగితే వారికి ఫారం-6 నింపడానికి అవకాశం కల్పించి, సరైన పరిశీలన తర్వాత నిరంతర నవీకరణలో భాగంగా వారి పేరును ఓటర్ల జాబితాలో చేర్చుతామని వెల్లడించారు. నోటీసుల దశలో ఈనెల 6 నాటికి మరో 1,73,071 మంది ఓటర్లు అర్హులు కారని తేలిందని వివేక్‌యాదవ్ పేర్కొన్నారు. వీరికి ఈనెల 16న ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో చేర్చేందుకు అర్హులు కారని చెప్పారు. తుది ఓటర్ల జాబితాను ఈనెల 16 న ప్రచురిస్తామన్నారు. జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1 , అక్టోబర్ 1 అనే నాలుగు అర్హత తేదీలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఏటా జనవరి ఒకటిని అర్హత తేదీగా పరిగణించి వార్షిక సారాంశ సవరణ జరుగుతుందని తెలిపారు. ఈనెల 16న తుది జాబితాలో పేరు లేని ఏ ఓటరైనా, తర్వాత అర్హత పొందిన ఏ వ్యక్తైనా నిరంతర నవీకరణ సమయంలో నమోదు కోసం ఫారం-6ను సమర్పించవచ్చునని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.

## త్వరలో డీపీఆర్

-మొదటిపేజీ తరువాయి

అత్యాధునిక లైడార్ సర్వేను పూర్తి చేశామని, దీని ఆధారంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే తూర్పు డెల్టా ఆధునీకరణకు రూ.1,137 కోట్లు, సెంట్రల్ డెల్టా ఆధునీకరణకు రూ.1,268 కోట్లతో ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే పశ్చిమ డెల్టా అంచనాలను కూడా పూర్తి చేసి అందించాలని అధికారులను ఆదేశించారు.

డెల్టా పరిధిలోని కాలువలు, డ్రెయిన్లు, బండ్ లెవెల్స్, డీసిల్టింగ్ (పూడికతీత), లాకులు, షట్టర్ల ఆధునీకరణ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా పూడికతో పూర్తిగా నిండిపోయిన సీ మౌత్‌ల వద్ద డ్రెడ్జింగ్ చేపట్టేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, నరసాపురం, భీమవరం తదితర ప్రాంతాల్లో సముద్రంలో కలిసే ప్రధాన డ్రెయిన్ల పూడిక తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దశాబ్దాల కాలం నాటి శిథిలావస్థకు చేరిన లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టడం లేదా అవసరమైన చోట కొత్త వాటిని నిర్మించడంపై కార్యాచరణ ఉండాలని పేర్కొన్నారు.

అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు చర్యలు

సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను ఖరారు చేసే ముందు, స్థానిక నీటి సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధుల క్షేత్రస్థాయి అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని ఐఐఎస్సీ టెక్నాలజీస్ ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఈ నివేదికలు పూర్తిగా సిద్ధమైన తర్వాత, వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ సలహాదారులు వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ (జజు), సూపరింటెండింగ్ ఇంజనీర్ (రాజు) ఐఐఎస్సీ టెక్నాలజీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేణిగుంటలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం

## గర్భిణులకు పసుపు-కుంకుమతో ఘన సత్కారం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
రేణిగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర వన్నె కుల డైరెక్టర్ తేజవతి, బీడీ బాలాజీ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి సిడిపిఓ కృష్ణవేణి గర్భిణీ స్త్రీలకు పసుపు-కుంకుమ పెట్టి, వారిని సత్కరించడంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణుల ఆరోగ్యం, పౌష్టికాహారం, తల్లి--బిడ్డ సంరక్షణపై అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాధాన్యత, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను వివరించారు. పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, బాలల ప్రాథమిక విద్యలో అంగన్వాడీ కార్యకర్తల సేవలు కీలకమని కార్యక్రమంలో పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా దీదీలను ఘనంగా సత్కరించారు. వారి సేవలను అభినందిస్తూ శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీజేపీ నాయకుడు సామంచి శ్రీనివాస్ పాల్గొని సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బిడి బాలాజీ మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరేష్, పురుషోత్తం రెడ్డి, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మీసేవ సేవల పునరుద్ధరణపై ఎమ్మెల్యేకు వినతి



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
మీసేవ, ఏపీ సేవ పోర్టళ్లలో నిలిపివేసిన కీలక సేవలను వెంటనే పునరుద్ధరిం చాలని మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేసి, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేసింది. కులం, ఆదాయ ధృవీకరణ పత్రాల రీ-ఇష్యూ, పట్టాదార్ పాస్‌బుక్ రీప్రింట్, వాటర్ ట్యాక్స్, జనన--మరణ ధృవీకరణ పత్రాల సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సంఘం తెలిపింది. ఆన్‌లైన్ సేవలపై అవగాహన లేని వృద్ధులు, నిరక్షరాస్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు సేవలు నిలిపివేయడంతో మీసేవ నిర్వాహకుల ఉపాధిపైనా ప్రభావం పడుతోందని పేర్కొంది. ప్రజలకు సురక్షితమైన సేవలు అందించడంతో పాటు నిర్వాహకుల ఉపాధిని కాపాడేందుకు మీసేవ, ఏపీ సేవ, 'మన మిత్ర' పోర్టళ్లలో అన్ని కీలక సేవలను పునరుద్ధరించాలని సంఘం కోరింది.

# ఘనంగా జామ్ జామ్ హోటల్ ప్రారంభం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారిపై మేర్లకపాక టోల్‌గేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జామ్ జామ్ హోటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి-తిరుపతి మార్గంలో ప్రయాణించే భక్తులు, ప్రయాణికులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించి హోటల్ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొని హోటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కనకదుర్గాదేవి ఆలయంలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

## ప్రచార పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థాన అనుబంధ దేవస్థానమైన శ్రీకనకాచలంపై వెలసిన శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పత్రికను బుధవారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు మాట్లాడుతూ ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు దర్శనం, ప్రసాదం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి, టీడీపీ నాయకులు, దేవస్థానం అధికారులు, పాల్గొన్నారు.

# 9న శ్రీకాళహస్తిలో ఇస్రో అంతరిక్ష అవగాహన సదస్సు

## ఏర్పాట్లను పరిశీలించిన ఇస్రో శాస్త్రవేత్తల బృందం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఈనెల 9న శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ ఆర్‌పీబీఎస్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4 నుంచి 10 వరకు నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సదస్సు ఏర్పాట్లను మంగళవారం ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రావు, శ్రీనివాసరావు, మునీర్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఇస్రో రూపొందించిన వివిధ రాకెట్లు, అంతరిక్ష నమూనాలను ప్రదర్శనలో విద్యార్థులకు చూపించనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరై అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

## ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**



శ్రీకాళహస్తి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి బుధవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసు కున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే స్పందించి వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.

# శ్రీకాళహస్తిలో 9న జనసేన ఆధ్వర్యంలో జాబ్ మేళా

## నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి : కొట్టే సాయి ప్రసాద్

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో తొలిసారిగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జనసేన నాయకులు తెలిపారు. బ్లూ స్టార్ ఏసీ కంపెనీ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగ నియామక కార్యక్రమాన్ని ఈనెల 9న నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు జాబ్ మేళా మంచి అవకాశమన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 9న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతాలాంబ దేవాలయం ఎదురుగా ఉన్న శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో జాబ్ మేళా జరుగుతుందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9840332850, 6301102807, 9491774088, 9059046057, 9381711439, 9701598120 నంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

## టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నెమళ్లూరు బుజ్జి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి పట్టణంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు టీడీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని యూనిట్ ఇన్‌చార్జి నెమళ్లూరు బుజ్జి పిలుపునిచ్చారు. రాష్ట్ర టీడీపీ ఆదేశాలు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచనల మేరకు పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం నెలవారీ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. యూనిట్ సమావేశాల ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి, వాటిని పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వార్డుల్లో ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు ఆకుల సునీత, చెందేటి బాలయ్య, మెదూరు శివకుమార్‌తో పాటు టీడీపీ కార్యకర్తలు రమేష్ బాబు, తేజ, ప్రసాద్, శివ, వాసు, చెంచు రామయ్య, రత్నమ్మ, కరీముల్లా, షరీఫ్, కృష్ణమాచారి, కోటచారి, హరి, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు సంక్షేమ సామగ్రి పంపిణీ కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 07:**



శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పారిశుధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న కార్మికులకు మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి యూనిఫామ్స్, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమన్నారు. ఎండ, వానను లెక్కచేయ కుండా విధులు నిర్వహిస్తున్న వారి ఆరోగ్యం, భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులోనూ కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ రవి ప్రకాష్, ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుదాము, సుధాకర్, పవన్, ఎన్విరాన్‌మెంట్‌సెక్రటరీలు, మేస్త్రీలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన

# వి.కోట దుర్గామాత ఆలయం

## విద్యుత్ దీపాలంకరణలతో దుర్గా నగర్‌లో ఆధ్యాత్మిక శోభ

**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**



వి.కోట పట్టణంలోని దుర్గా నగర్‌లో కొలువై ఉన్న శ్రీ దుర్గామాత ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంతో పాటు దుర్గా నగర్, అంబేద్కర్ సర్కిల్, బజార్ మార్గంలోని పంచాయతీ బస్టాండ్ వరకు విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్త రఘుపతి నాయుడు, పాలకవర్గ సభ్యులు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. విద్యుత్ దీపాలం కరణలతో ఆలయ పరిసరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైనఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయనిర్వాహకులు తెలిపారు.

# కుప్పంలో ఘనంగా సేవా జ్యోతి యాత్ర

## మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను స్మరించుకున్న కూటమి నాయకులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా కుప్పం నియోజకవర్గంలో బుధవారం సేవా జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించారు. కుప్పం చెరువు కట్ట నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం-ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్ సురేష్ బాబు, సీఎం వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తులసినాథ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను నాయకులు వివరించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నాయని నాయకులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు, మౌలిక వసతులు, సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి త్రిలోక్, కాణిపాకం వెంకటేష్, ప్రశాంత్, బీజేపీ రామచంద్ర తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# టీడీపీలో చేరిన వైసీపీ మాజీ సర్పంచ్ సహా 14 కుటుంబాలు

## కుప్పం టీడీపీ కార్యాలయంలో కండువాలు కప్పి ఆహ్వానించిన కూటమి నేతలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 07:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై రామకుప్పం మండలం రాజుపేట గ్రామపంచాయతీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ నారాయణస్వామి, వైసీపీ పంచాయతీ పార్టీ అధ్యక్షుడు కృష్ణప్పతో పాటు 14 కుటుంబాలు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. కుప్పం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం-ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారికి నాయకులు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో కాణిపాకం వెంకటేష్, కాడా అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, సత్యేంద్ర శేఖర్, ప్రశాంత్, పాల్గొన్నారు.

# ద్రావిడ విశ్వవిద్యాలయంలో ప్రకృతి విద్యపై వర్క్‌షాప్

కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 07:



ద్రావిడ విశ్వవిద్యాలయం, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి విద్యపై వర్క్‌షాప్ ను బుధవారం విశ్వవిద్యాలయంలోని ఎమెనో హౌస్ సెమినార్ హాలులో నిర్వహించారు. ప్రకృతి ఆధారిత అభ్యసనం, పర్యావరణ అవగాహన, జీవవైవిధ్య పరిరక్షణ, అనుభవాత్మక బోధనా పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ చిన్న మల్లయ్య లక్కినేని మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ప్రకృతి విద్య ఎంతో అవసరమని అన్నారు. ఈ అంశంపై మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు అగస్త్య ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తామని తెలిపారు. అగస్త్య క్రియేటివిటీ క్యాంపస్ హెడ్ సురేష్ టి.ఎస్., స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఆర్.యశోద, అగస్త్య టీచర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రామ్ హెడ్ మంజునాథ్ పి. పాల్గొన్నారు. వన్యప్రాణి ఫోటోగ్రాఫర్ శ్రీరామ్, పర్యావరణ శాస్త్రవేత్త లక్ష్మణ్ కుమార్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. అనంతరం విద్యార్థులను మల్లప్పకొండ ప్రాంతానికి తీసుకెళ్లి ప్రకృతిని ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కల్పించారు. కార్యక్రమంలో బి.ఎడ్., ఎం.ఎస్సీ. విద్యార్థులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by K.L.Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K L KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143, Cell : 9440815774